

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్

శుక్రవారం 24 అక్టోబరు 2025

భయం.. భయంగా..!



తొర్రూరు బస్టాండ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన గ్రానైట్ లారీ (ఫైల్)

- ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి 563పై నిత్యం ప్రమాదాలు
- సామర్థ్యానికి మించి లారీల్లో గ్రానైట్ రవాణా
- ఒక్కో వాహనం పైన 2 నుంచి 3 షీట్లు (బండరాళ్లు)..
- వరుస ప్రమాదాలతో ప్రజలు, వాహనదారుల బెంబేలు
- పట్టించుకోని మైనింగ్, రవాణా శాఖల అధికారులు

తొర్రూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ లారీలతో ప్రజలు, వాహనదారులు వణుకుతున్నారు. సామర్థ్యానికి మించి లోడ్‌లతో లారీలు వెళ్లతొండడంతో బెంబేలెత్తిపోతున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి 563పై గ్రానైట్ లారీలతో రాత్రి వేళలో జరిగే ప్రమాదాలతో ప్రజలు భయపడుతున్నారు. ఈ రహదారి గుండా ఎక్కువగా కరీంనగర్, నర్సంపేట, మహబూబాబాద్ రూట్ల నుంచి గ్రానైట్ లారీలు ఖమ్మం, విజయవాడ, నెల్లూరు ప్రాంతాలకు వెళ్తుంటాయి. గ్రానైట్ రవాణాతో రహదారులు ధ్వంసం కావడంతో, అధిక సామర్థ్యానికి మించి లారీల్లో తీసుకెళ్తుండటంతో డ్రైవర్లు నిద్రమత్తులో వాహనాలు అదుపు తప్పి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో వారం రోజుల వ్యవధిలోనే మూడు ప్రమాదాలు జరిగాయి. అనధికారికంగా జరిగిన చిన్నచిన్న ప్రమాదాలు కోకొల్లలు. అనుమతుల పేరుతో సామర్థ్యానికి మించి గ్రానైట్ లారీలు వెళ్తున్నా సంబంధిత మైనింగ్ అధికారులు ఒక్కరోజు కూడా లారీల బరువును తనిఖీ చేసిన దాఖలాలు ఎక్కడలేవు. డ్రైవర్లపైనా, స్పీడ్ నియంత్రణ అమలు చేయాల్సిన రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఒక లారీపైన 2 నుంచి 3 షీట్లు...

ఇతర ప్రాంతాల నుంచి గ్రానైట్ తరలించడానికి సంబంధిత అధికారుల వద్ద అనుమతులు పొంది, రవాణా చేస్తుంటారు. అయితే రవాణా చేస్తున్న సమయంలో నిర్వాహకులు ఒక లారీపైన 2 నుంచి 3 షీట్లు (బండరాళ్ల)ను లారీ సామర్థ్యానికి మించి రవాణా చేస్తున్నారు. సుమా రు 8 నుంచి 10 టైర్లు ఉన్న లారీపై 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు రవాణా చేసుకునే అవకాశం ఉంటుందని

(మిగతా 8లో..)

ప్రమాదాలు ఇలా..

వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గ్రానైట్ లారీల ద్వారా తొర్రూరు ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో జూన్ 9న ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై కరీంనగర్ నుంచి కాకినాడకు వెళ్తున్న మరో లారీ వెనుకాల గ్రానైట్ లోడ్ వస్తున్న లారీ ఢీకొట్టడంతో క్యాబిన్‌పై గ్రానైట్ రాయిపడి డ్రైవర్ బాలరాజు (52) అక్కడిక్కడే మృతి చెందాడు. అక్టోబరు 17న అతి వేగంతో వెళ్తున్న గ్రానైట్ లారీ ఢీకొని మాటేడు గ్రామానికి చెందిన బొల్లం వీరయ్య రైతుకు చెందిన 12 గొర్రెలు మృతి చెందాయి. అక్టోబరు 21న తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో అతివేగంతో వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగా యాలు అయ్యాయి. ఆ సమయంలో ఎవ్వరు అక్కడ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. లారీపై ఉన్న గ్రానైట్ షీట్లు రహదారిపై పడటంతో పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలగించడానికి శ్రమించారు.



మాటేడు వద్ద గ్రానైట్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు (ఫైల్)

ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలి

ఎస్కే అంకూస్, తొర్రూరు



రహదారి వెంట రాత్రి వేళలో గ్రానైట్ లారీలు లోడ్‌తో అతివేగంగా వెళ్తుంటాయి. రాత్రివేళలో డ్రైవర్లు నిద్రమత్తులో అతివేగంతో వెళ్లడం ద్వారా ఎక్కువగా తెల్లవారు జామునే ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలమయమైన రహదారిపై బరువుతో వెళ్లె లారీలు అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పాటించిన లారీలు సీజ్‌చేసి, చర్యలు తీసుకోవాలి.

మేడారంలో పనుల జాతర

- చురుగ్గా సాగుతున్న శాశ్వత నిర్మాణాలు
- శరవేగంగా దేవస్థానం, రోడ్ల విస్తరణ పనులు
- వంద రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మహా జాతర వరకు మారనున్న రూపురేఖలు!



మేడారంలో నూతనంగా నిర్మిస్తున్న గోవిందరాజు గద్దె

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వంద రోజుల్లో పనులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ముమ్మరమయ్యాయి. వందలాది ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా రాతి కట్టడాలను శాశ్వత పనులు చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. అభివృద్ధి పనులు ప్రారంభించిన 10రోజుల సమయంలో బేస్‌మెంట్ స్థాయి పనులు 50శాతం పూర్తయ్యాయి. పగిడిద్దరాజు, గోవిందరాజుల నూతన గద్దెల ఏర్పాటుకు, దేవస్థానం చుట్టూ ప్రాకారం

(మిగతా 8లో..)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాత బజారులో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబజారులోని గణేష్‌నగర్, గోగుల మల్లయ్యబజార్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, మార్కండేయ దేవాలయం, వెంకటరమణ థియేటర్, కల్లు కంపౌండ్ ఏరియా, ఫారెస్టు సెంటర్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, పతంజలి ఏరియా, రాంచంద్రపురం కాలనీ, వేల్పుల సత్యం కాలనీ, డబుల్‌బెడ్‌రూమ్ ఏరియా, రెడ్యానాయక్ కాలనీ, బీటీఆర్ నగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించాలి

- శాస్త్రీయ ఆధారాలతో త్వరితగతిన ఛేదించాలి
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిమినల్ కేసుల దర్యాప్తు పురోగతిని సాధించి, పెండింగ్ కేసులను శాస్త్రీయ సాంకేతిక ఆధారాలతో త్వరితగతిన ఛేదించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సూచించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నెలవారి క్రైం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన క్రిమినల్ కేసుల దర్యాప్తు పురోగతితో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులు, మహిళా భద్రత, సైబర్ నేరాలు, అక్రమ రవాణాలు, గంజాయి నియంత్రణ చర్యలు, ప్రజాశాంతి భద్రత అంశాలపై మండలాల వారిగా సమీక్ష నిర్వహించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. పోలీసులు విధినిర్వహణలో క్రమశిక్షణ, సమన్వయం, నిబద్ధతతో పని చేస్తూ ప్రజలకు దగ్గరవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా యూరియా పంపిణీలో పోలీస్ సిబ్బంది పనితీరు రాష్ట్రస్థాయిలో గుర్తింపును తెచ్చిందని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, నల్లబెల్లం సరఫరా, పీడీఎస్ బియ్యం, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించి, త్వరితగతిన ఛేంచాలన్నారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం కోర్ట్ డ్యూటీలో అద్భుతంగా పని చేసిన పలువురు సీడీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిషోర్, గండ్రాతి మోహన్, శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ రాంనాథ్ కేకన్


దళారులను నమ్మవద్దు

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ అగ్రికల్చర్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరకు మక్కలు అమ్ముకునే క్రమంలో దళారులను నమ్మి, వారికి డబ్బులు ఇవ్వద్దని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మక్కల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఏ సమయంలోనైనా, ఏ అర్ధరాత్రి అయినా తనకు ఫోన్‌చేసి చెప్పవచ్చని, రైతులకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మార్క్‌ఫెడ్, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వలన మక్కలు తడిసిపోయి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, తాను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సకాలంలో యూరియా అందించారన్నారు. మిర్చి పెట్టుబడులు ఎక్కువై రేట్లు తగ్గడంతో ఈ సారి పండించే రైతులు కూడా వరి, మొక్కజొన్న పంటల వైపు మొగ్గు చూపారని చెప్పారు. మక్కలకు మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉందని, రైతుల ఇళ్లవద్దనే ఆరబెట్టుకొని 14 శాతంలోపు తేమ ఉండే విధంగా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. కాగా, దుబ్బతండాకు చెందిన ధరంసోతు లక్ష్మణ్ అనేరైతు మార్కెట్‌కు మక్కలు తేవడంతో ఆయనకు ఎమ్మెల్యే మురళీనాయక్ శాలువా కప్పి సన్మానించారు. మార్కెట్ చైర్మన్ ఇస్లావత్‌సుధాకర్, వైస్‌చైర్మన్ మదన్‌గోపాల్ లోయా, మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి, మార్కెట్ సూపర్‌వైజర్ రమేష్, డైరెక్టర్ మల్లయ్య, ఎడ్ల రమేష్, నారాయణ, రాజేష్, ప్రవీణ్, దిలీప్ పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీనాయక్



కిక్కే.. కిక్కు..

మద్యం దరఖాస్తుల ద్వారా రూ.53.76 కోట్ల రాబడి

- జిల్లాలో గతేడాది కంటే పెరిగిన ఆదాయం
- 27న కొత్త దుకాణాలకు లక్కీడ్రా

నెహ్రూసెంటర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తు చేసు కోవడానికి గురువారం గడువు ముగిసింది. ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారా రూ.53.76 కోట్ల ఆదాయం సమకూరింది. 61 మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి 1,592 దరఖాస్తులు రాగా, రూ.53.76 కోట్ల రాబడి వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ తెలిపారు. ఈనెల 23న ఒక్కరోజే మహబూబాబాద్ స్టేషన్ పరిధిలో 49, తొర్రూరు స్టేషన్‌పరిధిలో 26, గూడూరు స్టేషన్ పరిధిలో 32 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 109 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,792 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. గతేడాది 2,589 దరఖాస్తులు వచ్చాయన్నారు. గత ఏడాదికంటే ఈ సంవత్సరం దరఖాస్తుల సంఖ్య కాస్త తగ్గినప్పటికీ ఆదాయం పెరిగిందన్నారు. గత ఏడాది 2589 దరఖాస్తులకు గాను రూ. 51.78 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని, ఈ సారి 1792 దరఖాస్తులకు రూ. 53.76 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈ సారి రూ.2 కోట్ల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఈ నెల 23తో దరఖాస్తుల స్వీకరణ ముగిసిందన్నారు. ఈ నెల 27న లక్కీ డ్రా ఉంటుందన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి

- ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చడానికి, హాజరుశాతాన్ని పెంచడానికి ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) నైపుణ్యాలపై దృష్టి సారించి, ప్రత్యేక పఠన మెరుగుదల ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడంతో పాటు అక్షరాస్యతను పెంపొందించాలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తూ సమయ పాలన పాటించాలన్నారు. ఎంఈవోలు మండలంలోని ప్రతీ పాఠశాలను సందర్శించి హెచ్‌ఎంలతో సమావేశాలు ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయుడితో శిక్షణ ఇప్పించి సందేహాలను నివృత్తి చేసి ప్రతిభావంతులుగా

(మిగతా 8లో..)



మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ
- హాజరు కానున్న లక్ష మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నుంచి 31వరకు సమ్మేటివ్-1 పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి గురువారం తెలిపారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటుతో సహా అన్ని యాజమాన్యాల పాఠశాలలు 1200లకు పైగా ఉన్నాయి. వాటిల్లో 1నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో లక్షకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సమ్మేటివ్-1 పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో తెలిపారు. తరగతులే, సబ్జెక్టుల వారీగా ప్రశ్నాపత్రాలను మండల విద్యావనరుల కేంద్రాలు చేర్చగా, అక్కడి నుంచి పాఠశాలలకు చేరాయని తెలిపారు. పరీక్షలు పూర్తి కాగానే వెంటనే మూల్యాంకనం చేసి నవంబరు 3న ఫలితాలనే విద్యార్థులకు తెలియజేయాలని, 4న విద్యార్థుల పేర్ల మీద ఆన్‌లైన్ చేయాలని, 5న తల్లిదండ్రల సమావేశాలు నిర్వహించి విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను తల్లిదండ్రుల సమావేశాల్లో వెల్లడించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులను ఇప్పటి నుంచే వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేయనున్నట్లు డీఈవో దక్షిణామూర్తి పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 6, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 వరకు, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు ఉంటుందని తెలిపారు.

నిరుపేదలకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



తొర్రూరు డబుల్‌బెడ్రూం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఉపేందర్

తొర్రూరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు తక్షణమే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్, బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా తమకు ఇళ్లు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో 300మంది ఆందోళన చేస్తూ దసరా రోజున గృహ ప్రవేశం చేశారు. గురువారం ఇళ్లను ఖాళీ చేయించడానికి వెళ్లిన అధికారులను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఉపేందర్ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇళ్లలోకి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే తమకు స్పష్టమైన హామీ ఇస్తే ఇళ్లను ఖాళీ చేస్తామని అప్పటివరకు ఎక్కడికి వెళ్లేది లేదని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తుందని ఆందోళన విరమించి, ఇళ్లు ఖాళీ చేయాలని కోరినప్పటికీ భీష్మించి కూర్చున్నారు.

సీపీఎం నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

తొర్రూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల సీపీఎం నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు గురువారం తొర్రూరు ఎస్సై ఉపేందర్ వెల్లడించారు. ఎస్సై కథనం ప్రకారం... తొర్రూరుకు చెందిన వేర్పుల మహేష్ అనే వ్యక్తి అన్నారం రోడ్డులోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద అప్పు ఉన్న వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుండగా అదే సమయంలో అక్కడికి వచ్చిన సీపీఎం నాయకుడు కొమ్మనబోయిన యాకయ్య, ఆయన భార్య పుష్ప మా గురించే మాట్లాడుతున్నావా.. అంటూ మహేష్‌పై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కుష్టివ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి



కుష్టివ్యాధి నిర్మూలనపై అవగాహన కలిపిస్తున్న హైదరాబాద్ లెప్రసీ క్లినిక్, ట్రైనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సుజాత

తొర్రూరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుష్టివ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని హైదరాబాద్ లెప్రసీ క్లినిక్, ట్రైనింగ్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత అన్నారు. గురువారం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా వర్కర్లు, సిబ్బందికి అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టివ్యాధి ముఖ్యంగా నరాలు చర్మానికి సోకుతుందన్నారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే 6 నుంచి సంవత్సరంలోగా నయం చేయవచ్చన్నారు. కుష్టివ్యాధి గ్రస్తులతో గౌరవంగా, ప్రేమతో ఉండాలని, వారికి మనోధైర్యం కలిపించాలన్నారు. ఈ సమావేశంలో లెప్రసీ క్లినిక్, ట్రైనింగ్ సెంటర్ జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, డీపీఎండీ విజయ, స్థానిక వైద్యులు నందనదేవి, డాక్టర్ మానస, డాక్టర్ మీరాజ్, విద్యాసాగర్, వనాకర్ రెడ్డి, ఏ.ఎన్.ఎం, సూర్‌వైజర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కూలిన సజ్జ- తప్పిన ప్రమాదం

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని రాపల్లికోట ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నం సజ్జ ఆకస్మాత్తుగా కూలింది. ఆ సమయంలో విద్యార్థులు బయట భోజనం చేస్తుండడంతో పెను ప్రమాదం తప్పింది. అనుకోని ఘటనతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భీతిల్లిపోయారు. తృటిలో ప్రాణ నష్టం తప్పిందని, ఆ సమయంలో విద్యార్థులు ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని అన్నారు.

గ్రామస్థుల తీర్మానంతోనే ఆస్పత్రి నిర్మాణం

● డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్

కొత్తగూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ గ్రామస్థుల తీర్మానంతోనే అంగడి సెంటర్‌లో 30 పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నామని, దావఖాన నిర్మాణంపై అసత్య ఆరోపణలు చేయవద్దని డీసీసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య సూచించారు. కొత్తగూడలో గురువారం వారు విలేఖరులతో మాట్లాడారు. కొత్తగూడ, గంగారం మండలంలో ఆస్పత్రులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇక్కడ 30 పడకల ఆస్పత్రిని మంత్రి సీతక్క మంజూరు చేయించారని వివరించారు. ములుగు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి బీఆర్ఎస్ హయాంలోనే ఈ ఆస్పత్రిని మంజూరు చేయించినట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. రెండు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి, లావణ్యవెంకన్న, కారోజు రమేష్, బిట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న బానోత్ రూప్‌సింగ్

మళ్లీ మొదలైన యూరియా కష్టాలు



యూరియా కోసం బారులు తీరిన రైతులు

మరిపెడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : యూరియా కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గురువారం మరిపెడ పీఏసీఎస్ దగ్గరికి యూరియా కోసం వందలాది మంది రైతులు తెల్లారేసరికే అక్కడికి చేరుకొని క్యూ లైన్లో బారులు తీరి నిలిచారు. ఈ ఏడాది అలస్యంగా వర్షాలు రావడంతో వరినాట్లు కూడా అలస్యంగానే పడ్డాయి. వరి పైరు ఈనే దశలో ఉంది. ఈ దశలోనే యూరియా వేస్తే పంట పూర్తిగా చేతికి వస్తుందని రైతులు గుర్తించి యూరియా కోసం మళ్లీ కుస్తీలు పడుతున్నారు. మరి కొందరు రైతులు రబీ పంట కోసం ఆరాట పడుతున్నారు. మరిపెడ పీఏసీఎస్‌లో 550 బస్తాలు అందుబాటులో ఉండగా రైతులకు వాటిని పంపిణీ చేశారు. కొందరికి యూరియా దొరకపోవడంతో వెనుతిరిగారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన



విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కలిపిస్తున్న మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్

మరిపెడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ పీఎస్‌లో పోలీస్ స్మారక సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్థానిక సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ స్టేషన్ నిర్వాహణ, క్రైంపైఅవగాహన, ఆయుధాల వినియోగం పై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు, పోలీ స్ సిబ్బంది ఆయా పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.



పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులకు బ్యాగులు అందజేత

తొర్రూరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సహకారంతో గురువారం విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేసినట్లు క్లబ్ ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నమాల యాకన్న మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు లయన్స్ క్లబ్ సహకారం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వనజపల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఝాన్సీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పోషకాహారం అందించాలి



అంగన్‌వాడీ సెంటర్‌లో గుడ్లను పరిశీలిస్తున్న సీడీపీవో

తొర్రూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని సీడీపీవో కమలాదేవి అన్నారు. గురువారం మండలంలోని మాటేడు, పోలేపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రాగిజావ, పల్లిపట్టీ లు, మునగాకు కారంపొడి, పౌషక ఆహారం పదార్థాలు, పండ్లు, చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. పుట్టే పిల్లలు రక్తహీనత, బలహీనత సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు సమకూర్చాలి



తొర్రూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

తొర్రూరురూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వసతులు సమకూర్చాలని తొర్రూరు తహసీల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కొనుగోలు కేంద్రాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో తొర్రూరులో 2, నాంచారిమదూరు, అమ్మాపురం, హరిపిరాల, చీకటాయపాలెం, గుర్తూర్, చింతలపల్లి, ఖానాపురం, వెల్లికట్టె, గోపాలగిరి, మాటేడు, సోమారం, మడిపల్లిలో2, చెర్లపాలెం, ఫత్తేపురం, వెంకటాపురం 18 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, టెంట్, విద్యుత్, మౌలిక సదుపాయాలతో పాటు గన్ని బస్తాలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీ కార్మికులను సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. దొడ్డుధాన్యం, సన్నధాన్యం వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో రాంనర్సయ్య, ఎస్సై ఉపేందర్, పీఏసీఎస్ సీఈవో మురళి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ విడత ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక

● రూ.1,01,302లు ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌ల నుంచి రికవరికి పీడీ ఆదేశం



ప్రజా వేదికలో సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ మధుసుదన్‌రాజు

దంతాలపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి)గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంను మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిగా జిల్లా పీడీ మధుసుదన్‌రాజు పాల్గొని ప్రజావేదికలో గ్రామాల వారిగా నిర్వహించిన పనులపై వెల్లడించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025మార్చి 31 వరకు ఈనివేదికలో జరిగిన పనులపై క్లుప్తంగా వివరించారు. ఈనెల 15 నుంచి 22 వరకు గ్రామాల్లో ఇంటింటా ఉపాధి పనుల నిర్వహణ, ఉపాధి కూలీలకు అందిన సొమ్ము వివరాలను పీడీ మధుసుదన్‌రాజు ఎదుట గ్రామాల వారిగా వెల్లడించారు. క్షేత్రస్థాయిలో 17 గ్రామాల్లో రూ. 1,01,302 ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లనుంచి రికవరికి ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 214 పనులకు గాను రూ. 2, 54, 62,384 కేటాయించనట్లు పీడీ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విజయ, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, ఏపీవో మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీవో 317 బాధితులకు శాశ్వత బదిలీలు చేపట్టాలి



సీరోలులో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్

కురవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు శాశ్వత బదిలీలు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. సీరోలు జడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని, వీరి స్థానంలో ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవోలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వి.భాస్కర్‌రావు, జిల్లా కార్యదర్శి పి.మంజుల, జె.కృష్ణాకర్‌రెడ్డి, సత్తార్, సత్యనారాయణ, శాంతకుమారి, శకుంతల, కల్యాణ్, నాగరాజు, కల్పన, సురేష్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

గంగారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ నవంబరు 3న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ ప్రజా సంఘాల రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం బూర్కవారి గుంపులో కరపత్రాలను విడుదల చేసిన అనంతరం ఏర్పాటైన సమావేశంలో వాసం నాగరాజు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాజకీయ పార్టీల అధికార దాహం కోసం ప్రజాభిప్రాయం సేకరణ లేకుండా, టీఏసీ తీర్మాణం లేకుండా ఆర్టికల్ 342 (1) (2)లకు విరుద్ధంగా లంబాడాలను ఎస్టీ జాబితాలో కలిపి, అసలైన ఆదివాసీ బిడ్డలకు నష్టం కలిగించారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడాలు 1,971 జనాభా లెక్కల ప్రకారం కర్నూలులో 12 వేల 778 మంది, అనంతపురంలో 43వేల 345 మంది, కడపలో 7,884, చిత్తూరులో 11వేల 5,15 మంది, శ్రీకాకులంలో ఒక్కరు మాత్రమే ఉన్నారన్నారు. హైదరాబాద్ నిజాం పాలనలో లంబాడాలు లేరని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయంగా 80 శాతం, ఉద్యోగాలలో 80 శాతం గిరిజన కోటాలో (ఎస్టీ జాబితా) వారే ఉంటున్నారని ఆయన ఆరోపించారు. చట్ట విరుద్ధంగా గిరిజన ఫలాలను పొందుతూ అసలైన ఆదివాసీ బిడ్డలకు అన్యాయం చేస్తున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఆదివాసీలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 3న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట తలపెట్టిన మహాధర్నాలో ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సంపత్, ప్రశాంత్, యాదగిరి, తాటి సుధాకర్, దారం సాంబరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

చిట్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ స్థానిక అధికారులను ఆదేశించారు. మండలంలోని ముచినిపర్తి గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. తాపీ మేస్త్రీలు, కూలీలను తీసుకొచ్చి చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేయించాలన్నారు. మోడల్ గ్రామంలో మంజూరైన 45 ఇళ్లకు 25 ఇళ్ల పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. గ్రామైక్య సంఘాల ద్వారా ఒక్కో లబ్ధిదారురాలికి రూ. లక్ష రుణం ఇప్పించాలని, ప్రభుత్వం నుంచి బిల్లులు రాగానే తిరిగి చెల్లిస్తారని ఇన్‌చార్జి ఏపీఎం గుర్రం రాజేందర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఉన్నారు.



ముచినిపర్తిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి


బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు రమేష్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

పాలకుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భారతీయ జనతాపార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి రమేష్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు హామీని నిలబెట్టుకుంటామని చెప్పి గొప్పలకు పోయి బోర్లపడ్డారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెడితే బీజేపీ సంపూర్ణ మద్దతు తెలిపిందని, అయితే హైకోర్టులో కేసు వేయించి నిలిపివేయించిది సీఎం రేవంత్‌రెడ్డి కాదా అని ధ్వజమెత్తారు. ఇతర మతానికి చెందిన వారిని బీసీలలో కలపడం ఏమిటని ప్రశ్నించారు. ఇతర మతానికి చెందిన బీసీల నుంచి తొలగిస్తే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మారం రవికుమార్, బాగాల నవీన్‌రెడ్డి, సతీష్, వేల్పుల దేవరాజ్, సంతోష్, శివకృష్ణ, గోనె అమరేందర్ ఉన్నారు.

జాతర పనుల పరిశీలన



కందికొండ జాతర స్థలంలో నాయకులు, అధికారులు

కురవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నవంబర్ 5న నిర్వహించే కందికొండ జాతర పనులను గురువారం ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ ఆదేశాలతో నాయకులు, అధికారులు పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఎంపీడీవో వీరబాబు, పీఆర్ డీఈ జుమ్మిలాల్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్, కాంగ్రెస్ నాయకులు బాలగాని శ్రీనివాస్, గొల్లపల్లి రజినీకాంత్, దువ్వ సైదులు, ముత్తిలింగం, జనార్ధన్‌రెడ్డి, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

రాష్ట్రంలో హిందువులకు రక్షణ కరువు

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రామరాజు

ఏటూరునాగారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులకు రక్షణ కరువైందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు విమర్శించారు. గోరక్షకుడు సోనా సింగ్‌పై ఎంఐఎం నాయకుడు ఇబ్రహీం చేసిన దాడికి వ్యతిరేకంగా ఏటూరునాగారం బస్టాండ్ కూడలిలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో హిందువులకు రక్షణ లేకపోవడం వల్లే నిజామాబాద్‌లో కానిస్టేబుల్ హత్య, హైదరాబాద్‌లో గో రక్షకుడిపై దాడి లాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జానార్దన్, బీజేపీ మండల అధ్యక్షుడు వినుకొల్లా చక్రవర్తి, పార్టీ సీనియర్ నాయకులు ఎర్రెల ఎల్లయ్య, స్థానిక ఎన్నికల కన్వీనర్ గాడిచర్ల రాజశేఖర్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పలక గంగ తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

సాంకేతిక సందడికి వేళాయె..

టెక్నోజియాన్-2025 కోసం 'నిట్' ముస్తాబు

- నేటి నుంచి 2 రోజుల పాటు ఉత్సవం
- దేశవ్యాప్తంగా వెయ్యి మంది విద్యార్థుల రాక
- వివిధ అంశాలపై 50 ఈవెంట్ల నిర్వహణ
- ముఖ్యఅతిథిగా హాజరవుతున్న చినాబ్ బ్రిడ్జి నిర్మాణ నిపుణురాలు ప్రొఫెసర్ మాధవీలత



వరంగల్ నిట్ టెక్నోజియాన్-2025 లోగో



హనుమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్-2025 (సాంకేతికోత్సవం) కోసం వరంగల్ నిట్ ముస్తాబైంది. శుక్ర, శనివారాల్లో (24, 25 తేదీల్లో) రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఈ సాంకేతిక పండుగ నిర్వహణకు క్యాంపస్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. దేశంలోని అన్ని ఎన్ఐటీల నుంచి వెయ్యి మందికిపై విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొననున్నారు. టెక్నోజియాన్‌లో వివిధ సాంకేతిక అంశాలకు సంబంధించి మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఈ సారి టెక్నోజియాన్.. విద్యార్థుల్లోని సృజనాత్మకత, నవ ఆవిష్కరణల సరిహద్దులను మరింతగా విస్తరించబోతున్నది. ఈవెంట్లలో విజేతలకు రూ.2.60లక్షల నగదు అందజేయనున్నారు. ఉత్సాహమైన పోటీలు, సాంకేతిక ప్రదర్శనలు, విభిన్న ఈవెంట్లతో కూడిన ఈ సాంకేతిక ఉత్సవం యువ మేధావులకు మరింత ప్రేరణగా నిలవనున్నది. భారత యువతను ఒక దగ్గర చేర్చే టెక్నోజియాన్-2025 నిర్వాహకులు విద్యార్థులే కావడం గమనార్హం. ఈవెంట్ల నిర్వహణ, వైజ్ఞానిక ప్రసంగాలు, వినూత్న ఆవిష్కరణలు అన్నీ విద్యార్థుల పర్యవేక్షణలోనే జరుగుతాయి. గతంలో ఈ సాంకేతికోత్సవం మూడు రోజుల పాటు జరిగేది. గతేడాది నుంచి రెండు రోజులకు కుదించారు.

ప్రారంభోత్సవంలో వివిధ విషయాల ప్రస్తావన

ఉదయం 10 గంటలకు నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఏఎల్‌సీ)లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవానికి బెంగళూరు ఐఐఎస్సీ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చినాబ్ వంతెన నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ మాధవీలత ముఖ్య అతిథిగా రానున్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధితో పాటు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ కె. కిరణ్‌కుమార్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్ రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ (టెక్నికల్) ప్రొఫెసర్ యు.వెంకన్న తదితరులు పాల్గొంటారు. ప్రారంభోత్సవంలో తొలుత టెక్నోజియాన్ గురించి విద్యార్థులకు పరిచయం చేస్తారు. దీనిపైనే ప్రత్యేకంగా రూపొందించిన ఒక వీడియోను ప్రదర్శిస్తారు. అనంతరం ముఖ్య అతిథి జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తారు. సాక్ టెక్నికల్ ప్రధాన కార్యదర్శి టెక్నోజియాన్-2025 గురించి క్లుప్తంగా వివరిస్తారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ కిరణ్‌కుమార్ రెండు రోజుల పాటు జరిగే ఈ టెక్నోజియాన్‌లో విద్యార్థులు ప్రదర్శించే వివిధ ఈవెంట్లు, వాటి ప్రత్యేకతల గురించి వివరిస్తారు. తర్వాత నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, ముఖ్య అతిథి ప్రొఫెసర్ జి.మాధవీలత ప్రసంగిస్తారు. చినాబ్ బ్రిడ్జి నిర్మాణం, దాని ప్రత్యేకతలపై ప్రసంగిస్తారు.

తొలిరోజు 32 ఈవెంట్లు


టెక్నోజియాన్ మొదటిరోజు 32 ఈవెంట్లు జరుగుతాయి. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలో రాకెట్ కురాన, మెడార్ట్, లై డిటెక్ట్ జెస్టూర్ మెఖా వెహికిల్ నిర్వహిస్తారు. కోడ్ రెడ్ బ్లేజ్, నియాన్ క్రికెట్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో జెస్టూర్ డ్రిఫ్ట్ ది లాంచ్ ప్యాడ్ ముఖ్యమైన ఈవెంట్లు. ఈ సారి టెక్నోజియాన్‌లో మొదటిసారిగా వరంగల్ ట్రేడింగ్ రింగ్ పేరుతో ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు.

దక్షిణ భారతంలోనే హైలెట్

వరంగల్ నిట్‌లో జరిగే ఈ సాంకేతికోత్సవానికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. దేశంలో టెక్నోజియాన్‌ను మొదటి సారి ప్రారంభించిన ఘనత వరంగల్ నిట్‌కు దక్కుతుంది. 2006లో ప్రారంభమైన ఈ ఉత్సవం రెండు దశాబ్దాలుగా సాగుతోంది. దక్షిణ భారతదేశంలో పెద్దఎత్తున నిర్వహించే సాంకేతిక ఉత్సవం ఇదొక్కటే. ప్రతీ ఏడు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ వేడుకలో పాల్గొనడానికి దేశంలోని వివిధ నిట్ కళాశాలల విద్యార్థులు ఎంతో ఉత్సుకతో ఎదురుచూస్తుంటారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వారి సరికొత్త ఆవిష్కరణల ప్రదర్శనకు వేదికగా నిలిచే ఈ టెక్నోజియాన్ ఏ యేడుకాయేడు వినూత్న సాంకేతిక పోకడలతో మరింతగా విస్తరిస్తోంది. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషలు, సంప్రదాయాలకు చెందిన విద్యార్థులంతా ఒకదగ్గర చేరి సాంకేతికంగా తమలో మెదిలే ఆలోచనలను, ఆవిష్కరణలను పరస్పరం పంచుకునే వేదికగా నిలిచే టెక్నోజియాన్ నిట్ క్యాంపస్‌లో ఒక మినీ భారతాన్ని ఆవిష్కరిస్తుంది. ఈసారి అన్ని కొత్త ఈవెంట్లనే ప్రదర్శించబోతున్నారు. విద్యార్థుల మేధాశక్తికి పరీక్షగా నిలిచే ఈ ఈవెంట్లన్నీ వర్తమాన సాంకేతిక విప్లవానికి ప్రతీకగా నిలవనున్నాయి. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రజల అవసరాలు, దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈవెంట్లు సరికొత్త సాంకేతిక ప్రపంచానికి స్వాగతం పలుకనున్నది.

ముఖ్య అతిథి మాధవీలత ప్రస్థానం

జమ్మూకశ్మీర్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చినాబ్ వంతెనను విజయవంతంగా నిర్మించడంలో కీలకపాత్ర పోషించిన ఐఐఎస్సీ (బెంగళూరు) ప్రొఫెసర్ మాధవీలత రాక్ ఇంజనీరింగ్‌లో స్పెషలిస్టు. చినాబ్ వంతెన నిర్మాణంలో ఒక జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా పదిహేడేళ్ల పాటు ఆమె పని చేశారు. మాధవీలత 1992లో జేఎన్‌టీయూ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు. ఈమె వరంగల్ నిట్ పూర్వ విద్యార్థి. నిట్‌లో ఎంటెక్ విద్యార్థిగా బంగారు పతకం సాధించారు. 2000లో ఐఐటీ మద్రాస్‌నుంచి జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పూర్తి చేశారు. మాధవీలత సివిల్ ఇంజనీరింగ్‌లో చేసిన కృషికి పలు అవార్డులు అందుకున్నారు. 2021లో ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ ఉత్తమ మహిళా జియోటెక్నికల్ పరిశోధకురాలిగా అవార్డును కైవసం చేసుకున్నారు.



మార్కెట్ దుస్థితిపై మండిపాటు



- పాలకుల నిర్లక్ష్యంపై రైతు సంఘాల ఆగ్రహం
- ఇప్పటికైనా స్పందించకుంటే దీక్షకు దిగుతామని హెచ్చరిక

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ దుస్థితిపై రైతు సంఘాలు భగ్గుమన్నాయి. పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, రోజురోజుకూ మార్కెట్ ప్రతిష్ఠను దిగజార్చుతన్నారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం నాడు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'మార్కెట్ అంటే లెక్కలేదా?' అన్న కథనానికి రైతు సంఘాల నాయకులు స్పందించారు. రైతులకు మేలు చేయడమే తమ లక్ష్యం అంటూ వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే పాలకుల తీరుపై మండిపడ్డారు. ఇంత పెద్ద వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గం లేకపోవడం, కనీసం కార్యదర్శిని నియమించక పోవడం, తగినంత సిబ్బంది లేకపోవడం, కనీస వసతులు కల్పించకపోవడం.. తదితర సమస్యలపై అసహనం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తాం..

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు

ఏనుమాముల మార్కెట్ సమస్యలు పరిష్కరించకుంటే నవంబర్ మొదటి వారంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట దీక్షలకు దిగుతామని రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ..మార్కెట్ సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు మార్కెటింగ్ శాఖాధికారులకు, కలెక్టర్‌కు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చి ఇచ్చి విసుగొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో 172 మార్కెట్లకు పాలకవర్గాలను నియమించామని వ్యవసాయశాఖ మంత్రి గొప్పగా చెప్పుకుంటున్నారు కానీ.. అతిపెద్ద మార్కెట్‌కు మాత్రం పాలకవర్గాన్ని నియమించలేకపోయారని విమర్శించారు. లక్షలాది మంది రైతులు విక్రయించుకునే మార్కెట్ పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

మార్కెట్లను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్



మార్కెటింగ్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని అఖిలభారత రైతు సమాఖ్య(ఏఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ ఆరోపించారు. రైతుకు అండగా ఉన్నామంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్‌కు పాలకవర్గం లేకుండా, కనీస వసతులు కల్పించకుండా తమది రైతు రాజ్యమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

మార్కెట్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు సంఘం భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరగాలంటే మార్కెట్‌కు పాలకవర్గం, కార్యదర్శి, తగిన సిబ్బంది ఉండాలని అన్నారు. లేదంటే వ్యాపారులు రైతులను నిండా ముంచుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మేడారం పనుల్లో నాణ్యత లోపించొద్దు

ములుగు కలెక్టర్ దివాకర



మేడారంలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం అభివృద్ధి పనులను నాణ్యత లోపించకుండా మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాలని అధికారులను ములుగు కలెక్టర్ దివాకర ఆదేశించారు. మేడారంలో జరుగుతున్న శాశ్వత అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. పూజారులు, అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగం పెంచాలని ఆదేశించారు.

గద్దెల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావుతో అన్నారు. మహా జాతరకు ముందుగా పనులను పూర్తి చేయడానికి అధికారులు, పూజారులు సమన్వయంలో ముందుకు సాగాలని సూచించారు. దేవస్థానం చుట్టూ నిర్మించే ప్రాకారం, ఆర్చి గేట్ పిల్లర్ల నిర్మాణాలు ప్రణాళికల ప్రకారం పనులు చేపట్టాలని అన్నారు. రోజువారీగా తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు.

స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ భేటీ

స్థానిక గిరిజన రైతులతో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్‌జీ మేడారంలని ఐటీడీఏ అతిథి గృహంలో గురువారం సమావేశమయ్యారు. మేడారం దేవస్థానం అభివృద్ధికి అవసరమయ్యే భూ సేకరణపై చర్చించారు. 19.27 ఎకరాల భూమిలోని రైతులతో మాట్లాడుతూ మేడారం దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. భూమి నష్టపోయే రైతుల వివరాలను సేకరించారు. ప్రభుత్వం చెల్లించే పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు ఆమోదం తెలిపితే కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, పూజారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సీతంపేట.. పూల వనమాయే

- గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ
- ముగిసిన నేతకానీల దీపావళి బతుకమ్మ
- ఆటపాటలతో సందడిగా మారిన చెరువు గట్టు

హసన్‌పర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు నిర్వహించే సీతంపేట నేతకాని కులస్తుల దీపా వళి బతుకమ్మ వేడుకలు గురువారం ముగిశాయి. కుటుంబసభ్యులంతా ఉదయమే కేదారీశ్వరస్వామి వ్రతం ముందు కూర్చొని నేతకాని కుల స్తులు రంగురంగుల పూలను సేకరించి తెచ్చిన పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలతో కలిపి చేసిన గౌరమ్మను బతుకమ్మపై ఏర్పాటు చేసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకన్నారు. సాయంత్రం మహిళలు బతుకమ్మలతో ఇంటి నుంచి బయలుదేరగా పురుషులు కోలాటాలతో ఊరేగింపులో పాల్గొని ఆటపాటలతో అలరించారు. దీంతో సీతంపేట పూల సింగిడిని తలపించింది.

వైభవంగా బతుకమ్మ వేడుకలు

మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నేతకాని కులస్తులు మాత్రమే జరుపుకునే దీపావళి బతుకమ్మ వేడుకలకు జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకుంది. దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నేతకాని కులస్తులు స్త్రీ, పురుషులు వేరువేరుగా జరుపుకునే ఈ దీపావళి బతుకమ్మ వేడుకలకు ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి బంధువులు పెద్దఎత్తున సీతంపేటకు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మూడో రోజు నేతకాని కులస్తులు మహిళలు మాత్రమే జరుపుకునే చివరి రోజు పండుగలో తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మను కేదారీశ్వరస్వామి ముందు ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులంతా ప్రత్యేకంగా పూజించారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపు, కుంకుమలతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని మహిళలు ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకున్నారు. దీంతో చెరువు పరిసర ప్రాంతమంతా సందడిగా నెలకొంది. మహిళలంతా చెరువు గట్టున చేరి బతుకమ్మలను ఒక్కచోట చేర్చి బతుకమ్మ పాటలతో సంబురంగా గడిపారు. అనంతరం బతుకమ్మలతో తీసుకువచ్చిన గౌరమ్మ (పసుపు ముద్ద)ను మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. రకరకాల పిండి పదార్థాలతో చేసిన తీపి పదార్థాలు (సద్దిని) ఒకరికొకరు తినిపించుకొని బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో మూడు రోజుల నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగిశాయి.



బతుకమ్మ ఆడుతున్న నేతకాని కులస్తులు



బతుకమ్మలను తీసుకొని చెరువు వద్దకు వెళ్తున్న మహిళలు

సీడ్ తీసుకొని ముఖం చాటేశారు..

- పర్వతగిరిలో లబోదిబోమంటున్న రైతులు
- డీలర్‌పై చర్యలు కోరుతూ పోలీసులకు ఫిర్యాదు



పర్వతగిరిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పర్వతగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర సీడ్ కంపెనీకి విత్తనాలు పండించి ఇచ్చి నెలలు గడుస్తున్నా డబ్బులు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డీలర్ మాటలు నమ్మి సాగు చేస్తే తమకు రిక్తహస్తాలే మిగిలాయని ఆవేదన చెందుతు న్నారు. న్యాయం కోరుతూ గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోని సుమారు 100 మంది రైతులు మహేంద్ర సీడ్ కంపెనీ విత్తనాలను తీసుకుని సాగుచేశారు. మహేంద్ర, హెచ్ఎంటీ, దివ్యశ్రీ, జయశ్రీ అనే నాలుగు రకాల సన్న విత్తనాలను పంపిణీ చేశారు. మహేంద్ర కంపెనీ సీడ్ 80 ఎకరాలు, హెచ్ఎంటీ 80 ఎకరాలు, దివ్య శ్రీ సీడ్ 50 ఎకరాలు, జయశ్రీ సీడు 20 ఎకరాల్లో సాగుచేశారు. ప్రభుత్వం కొనే మద్దతు ధర రూ. 500 బోనస్‌తో పాటు అదనంగా రూ.100 ప్రతీ క్వింటాకు చెల్లిస్తానని పర్వతగిరిలోని ఓ డీలర్ చెప్పడంతో అతడి మాటలను నమ్మి సాగు చేసినట్టు రైతులు చెబుతున్నారు. తమ నుంచి రూ.కోటి 30 లక్షల విలువ గల వరి ధాన్యాన్ని తీసుకెళ్లి డబ్బులు చెల్లించకుండా ఐదు నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని రైతులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వాలని గతంలో పలుమార్లు కోరగా, డీలర్ తన కుటుంబసభ్యులతో పోలీసులకు ఫిర్యాదు చేసి బెదిరింపులకు దిగినట్లు చెపుతున్నారు. దీనిపై బాధిత రైతులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, మహేంద్ర సీడ్ కంపెనీ వారు డబ్బులిచ్చినా కిందిస్థాయిలోని వారు నొక్కేసినట్టు అనుమానాలున్నాయని రైతులు చెబుతున్నారు.

దిగుబడి రాలేదు.. డబ్బులు ఇవ్వలేదు..

రావుల రాజు, పర్వతగిరి



నాకు సొంతంగా ఎకరం వ్యవసాయ భూమి ఉంది. మరో తొమ్మిది ఎకరాలు కౌలుకు చేస్తున్నా. పది ఎకరాల్లో మహేంద్ర కంపెనీ సీడు వేశాను. ఎకరానికి 40 బస్తాల దిగుబడికి బదులు 25 బస్తాలే వచ్చాయి. వచ్చిన వాటిని డీలర్‌కు ఇచ్చాను ఇంకా డబ్బులు ఇవ్వలేదు.

రైతుల ఫిర్యాదు వాస్తవమే..

బోగం ప్రవీణ్ కుమార్, ఎస్సై పర్వతగిరి

రైతులకు త్వరగా డబ్బులు ఇవ్వాలని చెప్పాం. గతంలో సైతం విషయం మా దృష్టికి వచ్చింది. రైతులు సంయమనం పాటిస్తే న్యాయం చేస్తాం. అనుకున్న సమయానికి డబ్బులు చెల్లించకపోతే సదరు వ్యక్తులపై కేసు నమోదు చేస్తాం.

బీసీ రిజర్వేషన్లలో ప్రధాని జోక్యం చేసుకోవాలి

బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు



మీడియాతో మాట్లాడుతున్న తిరునహరి శేషు

బాలసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో జోక్యం చేసుకోవాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్న బిల్లుపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం, రిజర్వేషన్లు తగ్గిపోయిన పరిణామాలను లేఖలో వివరించారు. రాజకీయ ప్రాతినిధ్యంలో ఎంబీసీలకు, సంచార జాతులకు జరిగిన అన్యాయాన్ని కూడా లేఖలో వివరించారు. మహిళా బిల్లు, ఎస్సీ వర్గీకరణ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం చూసిన చొరవ విధంగానే తెలంగాణ బీసీల రిజర్వేషన్ల విషయంలో కూడా ప్రధాని జోక్యం చేసుకొని బీసీలకు న్యాయం చేయాలని లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కూడా 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలని పార్లమెంట్‌ను వేదికగా చేసుకొని పోరాడి రిజర్వేషన్లు సాధించాలని ఆయన కోరారు.

బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినా బిల్లు ఆమోదం పొందనప్పటికీ బీసీల్లో చైతన్యం వచ్చిందని, భవిష్యత్తులో ఇది బీసీలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు మాట్లా డుతూ.. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపినా బీజేపీ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదించే విధంగా రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు కృషిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇంకా డాక్టర్ గడ్డం కృష్ణయ్య, ఎర్రబోజు రమేష్, బుట్టి శ్యాంయాదవ్, చిన్నాల యశ్వంత్, దామెరకొండ కొమురయ్య, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో సమీనా ఆఫ్రీన్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వర్సిటీ మ్యాథ్స్ విభాగం పరిశోధకురాలు సమీనా ఆఫ్రీన్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సమీనా ఆఫ్రీన్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'ఏ స్టడీ ఆన్ అనలిటిక్స్ హైరార్కి ప్రాసెస్ (ఏహెచ్‌పీ): అండ్ ఫజి అనలిటిక్స్ హైరార్కి ప్రాసెస్ (ఎఫ్ఏహెచ్‌పీ) ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ట్రాన్స్ పోర్టేషన్ ప్రాబ్లమ్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ సాధించారు. కేయూ మ్యాథ్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.తిరుమలదేవి పర్యవేక్షణలో సమీనా ఆఫ్రీన్ పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన సమీనా ఆఫ్రీన్ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో మ్యాథ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన సమీనా ఆఫ్రీన్ వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలంతో పాటు ఇతర అధ్యాపకులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యంలో తేమశాతం 17 శాతం కంటే పెరగకుండా, ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి వడ్ల కొనుగోలు చేయాలని జడ్పీ సీఈవో పురుషోత్తంసూచించారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం వడ్ల సేకరణపై ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, సీఐ సర్వయ్య, ఏపీఎం శంకర్, పీఏసీఎస్ కార్యదర్శి ప్రమోద్, ఆర్ఐలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని మరీనా పెయింట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న అడ్మిన్ మేనేజర్, అకౌంట్స్, టెలికాలర్‌చ స్టోర్ ఇంచార్జి, హెచ్‌ఆర్ టీమ్ లేదా డేటా ఎంట్రీ, లీగల్ టీం, ఆఫీస్ సబార్డినేట్ మొదలగు పోస్టులను అర్హత కలిగిన అభ్యర్థులచే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వయస్సు 18 నుంచి 35 ఏళ్ల మహిళలు, పురుషులు హాజరుకావచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరుకావచ్చన్నారు.



కేసముద్రం బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు



బ్రహ్మంగారితండా వద్ద రోడ్డు వెడల్పు చేయకుండా నిర్మిస్తున్న డివైడర్

ఆర్‌అండ్‌బీ వర్సెస్ విద్యుత్ శాఖలు

- రోడ్డు విస్తరణలో శాఖల మధ్య సమన్వయ లోపం
- వెడల్పు చేయకుండానే డివైడర్ నిర్మాణం
- విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే బీటీ

కేసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్‌లో కొద్దిరోజులుగా చేస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయ లోపంతో అస్తవ్యస్తంగా మారాయి. కేసముద్రం ఆర్‌వోబీకి ఇరువైపులా వందఫీట్ల రోడ్డుతో పాటు పొట్టిశ్రీరాములు సెంటర్ నుంచి వెంకటగిరి వైపునకు కొన్ని మీటర్లు, బ్రహ్మంగారి తండా మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రోడ్డు పనులను ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే రోడ్డుకిరువైపులా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కంకర, బీటీ వేస్తూ రోడ్డు నిర్మాణాన్ని చేస్తున్నారు. స్తంభాలు తొలగించకుండానే రోడ్డు డివైడర్‌ను నిర్మించడంతో విద్యుత్‌స్తంభాలు, డివైడర్‌కు మధ్యలో ఇరుకుగా మారి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. వెంకటగిరివైపున బస్టాండ్ వద్ద ఐదారు విద్యుత్ స్తంభాల చుట్టూ బీటీ వేయడంతో రోడ్డు మధ్యలో పోల్స్ ఉన్నాయి. రాత్రి వేళలో వాహనదారులు ఈ స్తంభాలను ఢీకొట్టే ప్రమాదం పొంచి ఉంది. తాజాగా బ్రహ్మంగారితండ వద్ద నందమూరినగర్ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు వైపున విద్యుత్ స్తంభాలను తొలగించకుండా డివైడర్ నిర్మాణానికి ఐరన్ జాలీలను ఏర్పాటు చేశారు.దీంతో ఆ కాలనీకి వెళ్లే వాసులు డివైడర్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్‌స్తంభాలు తొలగించకుండానే రోడ్డును నిర్మిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా స్తంభాల తొలగింపునకు విద్యుత్ శాఖకు ఫీజు చెల్లించేందుకు అంచనాలతో ఫైల్ పంపగా ఆ శాఖ వద్దనే పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇదే విషయంపై విద్యుత్ ఏఈ రాజు మాట్లాడుతూ ఆర్ అండ్‌బీ శాఖ నుంచి తమకు స్తంభాలు తొలగింపునకు సంబంధించిన డబ్బులు రాలేదని స్పష్టం చేశారు. ఇలా ఇరు శాఖలఅధికారులు చెబుతుండగా రోడ్డు విస్తరణలో విద్యుత్‌స్తంభాలు అడ్డుగా ఉండడం, డివైడర్‌తో రోడ్డు ఇరుకుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనేది వాస్తవం. ఇప్పటికైనా వెంటనే విద్యుత్ స్తంభాలను తొలగించిన తర్వాతనే రోడ్డు వెడల్పు పనులను చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా కొండా మురళి జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్నూరుకాపు పటేల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిట్టల రామారావు మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల పెన్నిధి కొండా మురళీ అని చెప్పారు. రాజకీయంగా ఎన్నో ఒడి దొడుకులు ఎదురైనా ప్రజా బలంతో ముందుకు వెళ్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన నేతగా ఎదిగారని తెలిపారు. మున్ముందు మరిన్ని ఉన్నద పదవులు అలకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుతారపు వెంకటనారాయణ, శంతన్ రామారాజు, పిట్టల శ్రీకాంత్, శిరంశెట్టి రఘు, రావిశెట్టి చంద్రశేఖర్, బోళ్ల జగ్గయ్య, పిట్టల చంద్రశేఖర్, కూన వేణు, గౌని యాకన్న, మార్నేని వేణు పాల్గొన్నారు.



కొండా మురళి జన్మదిన కేక్ కట్ చేస్తున్న మున్నూరు కాపు పటేల్స్ అసోసియేషన్ నేతలు

విద్యారంగ పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విద్యారంగ పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా, వైద్యరంగానికి ప్రాముఖ్యత నిస్తూ విద్యారంగ అభివృద్ధి పక్షపాతిగా ముందుకుసాగుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పాఠశాల పరిసరాలను ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామే అలానే ఉంచుకోవాలన్నారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు.

అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

● గూడూరు : ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు పారదర్శకంగా, జవాబుదారీ తనంతో పనిచేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ వ్యవసాయం, విద్యుత్, తాగినీరు, విద్యా, వైద్యం, రహదారుల సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. అధికారులు స్థానికంగా ఉంటూ పనిచేయాలని సూచించారు.

అనంతరం కల్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగభవాని, నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భయం.. భయంగా..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే 8 టన్నుల వరకు ఉండాల్సిన షీట్ సామర్థ్యం పెంచి రవాణా చేస్తుంటారు. దీంతో ఎక్కువగా రాత్రి వేళ్లలో రవాణా కొనసాగుతుండగా డ్రైవర్లు నిద్రమత్తులో ఉంటూ గమ్యాన్ని చేరుకోవాలనే ఉద్దేశంతో వెనుకాల ఉన్న రాళ్లను పరిశీలించకుండా పోతుంటారు.

వాహనాల వేగంతో రక్షణ లేకుండా ఉన్న రాళ్ల కదలడంతో లారీని అదుపు చేసే క్రమంలో ఇటీవల వెనకాల ఉన్న మూడు రాళ్లలో ఒక రాయి డ్రైవర్ క్యాబిన్‌పై పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన కూడా ఉంది. అనుమతి పేరుతో ఇష్టారాజ్యంగా రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు ఎక్కడ కూడా లారీల బరువును తనిఖీ చేయడం లేదు. వాహనాల డ్రైవర్లు తీసుకోవల్సిన జాగ్రత్తలు పాటించకుండా వేగంగా వెళ్లడంతో వాహనాలు అదుపుతప్పి ప్రజల ప్రాణాలు పోతున్నాయి.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి

(5వ పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, డీఈవో దక్షిణమూర్తి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతలను విస్మరిస్తే చర్యలు

● చిన్నగూడూరు (మరిపెడ) : అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. గురువారం చిన్నగూడూరు మండలంలోని కస్తూర్బా, అంగన్‌వాడీ సెంటర్, ఉగ్గంపల్లిలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా స్కూల్లోని రికార్డులను పరిశీలించారు. వంటలను చెక్ చేశారు. స్టోర్, కిచెన్ గదులను తనిఖీ చేశారు. విద్యార్థినుల విద్యా సామర్థ్యాలపై వారితో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ అనుసరించి భోజన ఏర్పాట్లు జరగాలని సూచించారు. అర్థమయ్యేలా బోధన పద్ధతులు పాటించాలన్నారు. విధులు విస్మరిస్తే శాఖపరమైన చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. అక్కడి అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీచేశారు. చిన్నారులకు అందుతున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఉగ్గంపల్లిలోని పీహెచ్‌సీకి వెళ్లి ఓపీ రోగుల రిజిస్టర్ చూశారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వైద్య సేవలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. ఈ సందర్భంగాచిన్నగూడూరు తహసీల్దార్, ఎంపీడీవో, కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపాల్ సిబ్బంది ఉన్నారు.

పత్తి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ మార్కెట్ సీజన్‌లో వచ్చే పత్తి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఖరీఫ్ మార్కెట్ సీజన్‌లో పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్‌ను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 84,718 ఎకరాల్లో పత్తి పంట సాగు జరిగిందని, 6.14 లక్షల క్వింటాల పత్తి దిగుబడి వస్తుందని అంచనా ఉందని చెప్పారు. జిల్లాలో సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 8110 ఉందని, రైతులు తమ పత్తిని తక్కువ ధరకు దళారులకు, మధ్యవర్తులకు, ఇతరులకు అమ్ముకోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. సీసీఐ వారిచే మానుకోటలో వ్యవసాయ మార్కెట్‌పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లు, కేసముద్రం మార్కెట్ పరిధిలో మూడు జిన్నింగ్ మిల్లులు, తొర్రూరు మార్కెట్ యార్డు పరిధిలో రెండు జిన్నింగ్ మిల్లులు మొత్తంగా ఆరు పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పత్తి తీసుకుని వచ్చేటప్పుడు నాణ్యతను పరిగణలోకి తీసుకోవాలని, పత్తి నాణ్యతగా ఉంటే వెంటనే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు నిమిత్తం జిన్నింగ్ మిల్లుల్లో తాగునీరు, మరుగుదొడ్లు మొదలగు సౌకర్యాలను సమకూర్చాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి పంట తీసుకువచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ కార్డుతో లింక్ చేయాలని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ, వెయింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. పత్తి కోనుగోలు కేంద్రాలకు నిరంత రాయంగా విద్యుత్‌సరఫరా ఉండేలా చూడాలన్నారు. కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, అలాగే పత్తి అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు విజయనిర్మల, సాయిచరణ్, వెంకటేశ్వర్లు, సాయిచరణ్ పాల్గొన్నారు.



మేడారంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులు



దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న పగిడిద్దరాజు గద్దె

మేడారంలో పనుల జాతర

(5వ పేజీ తరువాయి)

నిర్మాణానికి, రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్లకు ఇరువైపులా డ్రైయినేజీ, వనం రోడ్డుకు సీసీ నిర్మాణం, ఊరట్టం నుంచి కాల్వపల్లి బీటి రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మహాజాతర 2026 జనవరి 28 నుంచి 3 1వ రకు జరగనుంది. ఇంకా 97 రోజుల సమయం ఉంది. ఈ నేపథ్యంలో జనవరి 20వ తేదీ లోగా పనులు పూర్తి కావాలని మంత్రులు పొంగులేటి శ్రీనువాస్‌రెడ్డి, ధనసరి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు కాంట్రాక్టర్లతో పనుల్లో వేగం పెంచారు.

మహా జాతర నాటికి మేడారానికి కొత్త రూపు సంతరించుకోనుందని తెలుస్తోంది. సమ్మక్క- సారలమ్మల దేవస్థానం శాశ్వత అభివృద్ధికి ప్రభుత్వం రూ. 101కోట్లు నిధులు కేటాయించగా, ముందుగా రూ. 51కోట్లు మంజూరయ్యాయి. దీంతో దేవస్థానంలో నూతనంగా గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెల నిర్మాణం, దేవస్థాన ప్రాంగణానికి చుట్టూ ప్రాకారం, దేవస్థానం చుట్టూ ప్రత్యేక విశాలమైన రోడ్డు ఏర్పాటు, అతిథి గృహ నిర్మాణం, పూజా మందిరాల మరమ్మతులు వంటి శాశ్వత పనులు చేపడుతున్నారు. ఇవి ప్రస్తుతం బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి.

అదేవిధంగా మహాజాతరలో భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయి. మేడారం పరిసరాల్లో రూ. 42కోట్లతో రోడ్ల విస్తరణ, మరమ్మతుల పనులు చేపట్టారు. నార్లాపూర్ శివారు చింతల్ ఎక్స్ రోడ్డు నుంచి మేడారం శివరాంసాగర్ ఆర్టీసీ వై జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా మహాజాతరలో పూజారులకు ముఖ్యమైన రహదారి వనంరోడ్డు అభివృద్ధిలో భాగంగా రూ. 1.30 కోట్లతో 400 మీటర్ల సీసీ పనులు చేపట్టారు. అలాగే మహాజాతరలో భక్తుల ట్రాఫిక్ మళ్లింపునకు కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రూ. 8కోట్లతో బీటీరోడ్డు పనులు చేపట్టారు. కాల్వపల్లి నుంచి మేడారం రోడ్డు చెక్‌పోస్టు వరకు నాలుగు కిలో మీటర్ల మేరకు రూ. 2.50కోట్లతో పనులు చేపట్టారు. దీనితో మేడారం పరిసరాల్లో అభివృద్ధి పనుల జాతర నెలకొంది. వీటిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

నేడు దిశ కమిటీ సమావేశం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశమందిరంలో ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు దిశ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, దిశా కమిటీ సభ్యులు హాజరు కానున్నారని చెప్పారు.

ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలనుఅందజేస్తున్న ఈవో విజయలక్ష్మి

కురవి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చివరి జాబితాలో ఎంపికైన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రనాయక్ ఆదేశాలతో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్, ఈవో విజయలక్ష్మి సమక్షంలో గురువారం అందజేశారు. అర్హులైన వారికి రెండో జాబితాలో వస్తాయని ఓపిక వహించాలని రాజేందర్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి అవిరె మోహన్‌రావు, శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, బుక్క నాగరాజు, తరాల వీరన్న, గణేష్, దైద భద్రయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నిరసనకు తరలిరండి

కేసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు జడ్జీ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో నవంబర్ 1న ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనకు తరలిరావాలని ఆ సంఘం నాయకులు కంటిపూడి అరుణ్‌కుమార్, బిర్రు యుగేందర్ పిలుపునిచ్చారు. కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో గురువారం సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెల్లంపల్లి శ్రీకాంత్, జన్ను కృష్ణ, చంటి, రాజేందర్, ఇమాంఅలీ, సుధాకర్, మురళి, యాకయ్య పాల్గొన్నారు.

రేపు ఐఆర్‌సీఎస్ సర్వసభ్య సమావేశం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లయన్స్ భవనంలో ఈనెల 25న ఉదయం 10.30 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు అద్వైత్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న నారాయణపురం రైతులు

కేసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలో తమ భూములకు పట్టాదారుపాస్‌పుస్తకాలివ్వాలని కోరుతూ ఆ గ్రామ రైతులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. తొమ్మిదేళ్లుగా పట్టాపాస్‌పుస్తకాలు లేక ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల విలువైన పథకాలను నష్టపోయామని, అధికారులు పట్టాలివ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నర్సింహులపేట ఠాణాలో ఓపెన్ హౌస్



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

నర్సింహులపేట (మహబూబాబాద్‌క్రైం), అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్, మోడల్ పాఠశాల విద్యార్థులకు ఆయుధాల వినియోగం, చట్టాలపై ఎస్సై మాలోతు సురేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



నెహ్రూసెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో డీజీపీ కార్యాలయ ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మానుకోటలో గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల అజయ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో గోవులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న బీజేపీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలపై ఇబ్రహీం దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అతన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గోవులకు రక్షణగా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, దారా ఇందు భారతి, రేష్మ, ఓర్సు పద్మావతి, రాధాపటేల్, భద్రయ్య, సందీప్, సతీష్, జహేందర్‌నాయక్, రవి, మల్లం యశ్వంత్ పాల్గొన్నారు.

తడిసిన పంటలను కొనుగోలు చేయాలి

- అఖిల భారత ఐక్యరైతు సంఘం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో తడిసి రంగు మారిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేపట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చంద్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఆవుల కట్టయ్య, సీనియర్ నాయకులు జగ్గన్న మాట్లాడారు. పంటలను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకువస్తే తడిసిందని, రంగు మారిందని కొనుగోలుదారులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు, ప్రభుత్వరంగ సంస్థలతో మొక్క జొన్న క్వింటాకు రూ.3 వేలు, పత్తి క్వింటాకు రూ.10 వేల చొప్పున కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. యాసంగి వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బిక్షం, రంగయ్య, పాపయ్య, వెంకన్న, కొమరయ్య, రమేష్, రాములు, కొమరమల్లు, జానకిరాములు, ఈర్ల వెంకన్న పాల్గొన్నారు.